క్లుప్తంగా

మహిళా విభాగాన్ని పటిష్టం చేస్తా



నిసార్‌అహ్మద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న షమీమ్‌అస్లాం

మదనపల్లె : వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్‌ను ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్‌, అన్నమయ్యజిల్లా వైఎస్సార్‌ సీపీ మహిళావిభాగం అధ్యక్షురాలు షమీమ్‌అస్లాం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శనివారం నిసార్‌అహ్మద్‌ స్వగృహానికి వెళ్లిన ఆమె...పుష్పగుచ్ఛం అందించారు. తనపై నమ్మకంతో పార్టీ కేటాయించిన పదవికి న్యాయం చేస్తానని, మహిళా విభాగాన్ని పటిష్టం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. అలాగే..అన్నమయ్యజిల్లా బీసీ సెల్‌ అధ్యక్షుడిగా నియామకం పొందిన సాంబశివ, నిసార్‌అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని తన నియామకంపై కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కలికిరి : కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1971–72 పదవ తరగతి బ్యాచ్‌ పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అప్పటి గురువులైన జే.రుద్రయ్య, ఎం.సుబ్బరాజశెట్టి, పంచతర్నమ్మ, పి.నారాయణరెడ్డిలను దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. పాఠశాల వద్దకు రాలేని స్థితిలో వున్న మరో ఉపాధ్యాయుడు నబీ సాహెబ్‌ను ఇంటి వద్దనే సన్మానించారు. పాఠశాల ఆవరణలో అప్పట్లో గురు విద్యార్థుల మధ్య ఉన్న బంధాలు, బాంధవ్యాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలకు తమ గుర్తింపుగా రూ.71వేలు విలువ చేసే కంప్యూటర్‌, వైఫై, ర్యాక్‌లను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

శ్రీలక్ష్మీనరసింహుడికి విశేష పూజలు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని పలురకాల రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

పెద్దతిప్పసముద్రం : అరుద్ర నక్షత్రం, మాఘ మాసం సందర్భంగా శనివారం స్థానిక శివాలయంలో శివ పార్వతుల కల్యాణాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఉభయదారులుగా కర్ణాటక రాష్ట్రం కై వారంకు చెందిన శ్రీనివాసులు, అనూషా దంపతులు పాల్గొని వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య, ఆకుల మల్లికార్జునలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రేపు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ

పెద్దతిప్పసముద్రం : పీటీఎం పీహెచ్‌సీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈ నెల 10న నులి పురుగుల నివారణ మాత్రలను అందజేస్తామని డాక్టర్లు పురుషోత్తం నాయక్‌, యస్దానీలు అన్నారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల దినోత్సవంలో మండల స్థాయి అధికారులు కూడా పాల్గొంటారన్నారు.

రామావతారంలో జనార్దనస్వామి

రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ జనార్దనస్వామి రథోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారు శ్రీ రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు పార్థసారధిభట్టర్‌, కులశేఖర్‌భట్టర్‌లు భక్తులకు స్వామివారికి దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మదనపల్లె టీబీ విభాగం తనిఖీ

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఉన్న జీజీహెచ్‌ పరిధిలోని టీబీ విభాగాన్ని శనివారం మదనపల్లి డివిజన్‌ టీబీ అధికారి డాక్టర్‌ శ్రీధర్‌ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్‌ శ్రీధర్‌ మాట్లాడుతూ టీబీ డాట్‌ సెంటర్‌, గళ్ళ పరీక్షలు విభాగాల నిర్వహణను పరిశీలించారు. టీబీ యూనిట్‌ పరిధిలో మందులు వాడుతున్న వారి వివరాలు , గళ్ల పరీక్ష చేసుకొన్న వారి వివరాలను నమోదు చేసిన రికార్డులను చూశారు. టీబీ విభాగ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

మదనపల్లె సిటీ : మదనపల్లెలో శనివారం జవహర్‌ నవోదయ విద్యాలయంలో 9వతరగతి, ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు సెంటర్లు, వివేకానంద మున్సిపల్‌ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్‌ పర్యవేక్షించారు.

వీధుల్లోకి వెళ్లే మార్గమేది?

- దారులకు అడ్డంగా వాహనాలు, తోపుడుబండ్లు
- పద్మవ్యూహంలా మారిన ట్రాఫిక్‌
- వీధుల్లో నిత్యం ఘర్షణలే



ద్విచక్రవాహనాలతో మూసుకుపోయిన బజారువీధికి వెళ్లే మార్గం



సత్రం వీధికి వెళ్లే దారిలో అడ్డంగా ఉంచిన వాహనాలు

గుర్రంకొండ : రోజురోజుకు వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న గుర్రంకొండ పట్టణంలోని బస్టాండు, ఎన్‌హెచ్‌ 340 ప్రధాన రహదారి నుంచి పలు వీధులకు వెళ్లే దారులు మూసుకుపోతున్నాయి. వీధుకు వెళ్లే మార్గాల్లోని స్థలాలు కబ్జాలకు గురికావడంతో ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధులకు వెళ్లే ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్‌ పద్మవ్యూహంలా మారి నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయి. పట్టించుకొని చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

అడ్డదిడ్డంగా తోపుడుబండ్లు, వాహనాలు

బస్టాండు నుంచి సర్కారుబావి సందు మీదుగా సత్రంవీధి, బజారువీధి, పోలేరమ్మ, బలిజగడ్డ వీధులకు వెళ్లే మార్గాలు మొత్తం కబ్జాకు గురయ్యాయి. మెయిన్‌రోడ్డు నుంచి వీధులకు వెళ్లే ప్రారంభస్థలాలు మొత్తం దుకాణాదారులు ఆక్రమించుకోవడంతో గతంలో ఆటోలు వెళ్లే మార్గం నేడు ప్రజల నడక దారి కూడా కనుమరుగు అయ్యింది. ఎన్‌హెచ్‌ 340 మెయిన్‌ రోడ్డు నుంచి పట్టణంలోని పలువీధులకు వెళ్లే ప్రధాన రహదారులు మొత్తం కబ్జాకు గుయ్యాయి. వీధులకు అడ్డంగా ద్విచక్రవాహనాలు అడ్డదిడ్డంగా ఉంచేస్తున్నారు. ఇదే మార్గంలో వందలాది మంది విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలలకు వెళుతుంటారు. వేలాది మంది ప్రజలు ఇదే మార్గం నుంచి పట్టణానికిదిగువ నున్న దర్గావీధి, ఎల్లుట్ల గడ్డ, తాళింపేట, ఖాజీవాడ, తహసీల్దార్‌ కార్యాలయం కు వెళుతుంటారు. అయితే కొంతమంది దారి మొత్తాన్ని ఆక్రమించుకొని వాహనాలు, దుకాణాలు ఇష్టానుసారం ఏర్పాటు చేసుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పద్మవ్యూహంలా మారిన ట్రాఫిక్‌

ఎక్కడపడితే అక్కడ వీధుల్లోకి వెళ్లే స్థలాలను కబ్జాలు చేస్తుండడంతో వాహనాల పార్కింగ్‌కు గానీ, వీధుల్లోకి వెళ్లడానికిగానూ వాహనాలకు తగినంత స్థలం లేకపోవడంతో ట్రాఫిక్‌ పద్మవ్యూహంలా మారింది. బస్టాండు నుంచి పలు ఆస్పత్రులకు అత్యవసర చికిత్స కోసం ప్రజలు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, రోగులను తీసుకొచ్చే వాహనాలు సకాలంలో ఆస్పత్రులకు చేరుకోలేక నానా కష్టాలు పడుతున్నారు. బస్టాండులో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సిమెంటు బల్లల ముందువైపు కూడా ఆటోలు, వాహనాలు ఇష్టానుసారం నిలిపివేస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బల్లలపై కూర్చొని బస్సులు వచ్చినప్పుడు రోడ్డుపైకి చేరుకోవాలంటే ప్రయాణికులు అడ్డదిడ్డ వాహనాల పార్కింగ్‌తో నానా కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల బస్టాండులో ట్రాఫిక్‌ సమస్య కారణంగా పలు వాహనాలు, వాహనాదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు చోటు చేసుకొన్నాయి.

నిత్యం ఘర్షణలే !

ప్రధాన వీధులకు వెళ్లే మార్గంలో స్థలాలు కబ్జాకు గురికావడంతో పాటు ద్విచక్రవాహనాల ఇష్టానుసారం నిలిపివేస్తుండడంతో నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయి. దీనికితోడు కళాశాలకు వెళ్లే విద్యార్థినిలను పోకిరీలు అక్కడే మకాం వేసి వేధింపులకు గురిచేస్తున్నారు. దారికి అడ్డంగా ద్విచక్రవాహనాలనుంచే వారు ఇదేమిటని ప్రశ్నించే ప్రజలపై నిత్యం వాగ్వివాదాలు, ఘర్షణలకు దిగుతుండడం పరిపాటిగా మారింది. గంజాయి, మద్యం మత్తులో పలువురు యువకులు వీధుల్లోబైక్‌ రేసింగ్‌లకు పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకొన్న దాఖలాలు లేవు. ఘర్షలతో గాయాలపాలైన పలువురు పోలీస్‌స్టేషన్లో కేసులు పెట్టుకోవడం వరకు వెళుతోంది.

చర్యలు తీసుకొంటాం



మెయిన్‌ రోడ్డు నుంచి పట్టణంలోని పలువీధులకు వెళ్లే ప్రధాన మార్గాల్లో స్థలాలు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొంటాం. గతంలో పలుమార్లు కబ్జాదారులకు పంచాయతీ తరపున నోటీసులు జారీ చేశాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు చేపడతాం.

– శ్రీహరి, పంచాయతీ ఈఓ, గుర్రంకొండ

సమస్య పరిష్కరిస్తాం



పట్టణంలోని పలు ప్రధాన వీధులకు వెళ్లే మార్గాల్లో నెలొన్న ట్రాఫిక్‌ సమస్యనుక పరిష్కరిస్తాం. వీధుల వద్ద ఇష్టానుసారంగా వాననాలు ఉంచేవారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తాం. ఇకపై వీధుల వద్ద పోలిసుల నిఘా ఉంచి శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై తగు చర్యలు తీసుకొంటాం.

– మధురామచంద్రుడు, ఎస్‌ఐ, గుర్రంకొండ

రాష్ట్రస్థాయి మెరిట్‌ టెస్ట్‌లో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థి బావాజాన్‌

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఎస్‌. బావాజాన్‌ రాష్ట స్థాయిలో జరిగిన ఎడ్యుకేషనల్‌ ఏపీహని మెరిట్‌ టెస్ట్‌ (ఈఈఎంటీ)లో ప్రథమ స్థానం సాధించాడు. శనివారం ఈవిషయమై హెచ్‌ఎం మల్లయ్య మాట్లాడుతూ సైన్స్‌ టీచర్‌ శ్రీపతి ప్రోత్సాహంతో విద్యార్థి బావాజాన్‌ గత ఏడాది డిశెంబర్‌లో ఆన్‌లైన్‌లో ఈఈఎంటీ ప్రిలిమ్స్‌ టెస్ట్‌లో ఎంపికై ఈ ఏడాది జనవరి 19న మెయిన్స్‌ పరీక్ష రాసాడన్నారు. ఈ నేపథ్యంలో వెలువడిన ఫలితాల్లో రాష్ట వ్యాప్తంగా కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఎంపిక అయ్యారు. ఇందులో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందన్నారు. సదరు విద్యార్థి శనివారం తండ్రి చాంద్‌బాషాతో కలసి మంగళగిరిలోని సీ మ్యాట్‌ డైరెక్టర్‌ మస్తానయ్య చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమెంటోతో పాటు రూ.8 వేల నగదు రివార్డు అందుకున్నట్లు పాఠశాల క్లస్టర్‌ సీఆర్పీ నాగరాజు తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే బీసీలకు సముచిత స్థానం



మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న సాంబశివ తదితరులు

కలికిరి(వాల్మీకిపురం) : వైఎస్సార్‌సీపీతోనే బీసీలకు సముచిత స్థానం సాధ్యమవుతుందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. జిల్లా బీసీ విభాగం నూతన అధ్యక్షులుగా నియమితులైన తంబళ్ళపల్లి నియోజకవర్గం గొల్లపల్లికి చెందిన సాంబశివ శనివారం వాల్మీకిపురంలోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో బీసీలకు అన్ని పదవులలో రిజర్వేషన్‌లు కల్పించి సముచిత స్థానం కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలలో వారికి పెద్దపీట వేయడం జరిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, మండల పార్టీ కన్వీనర్‌ నీళ్ల భాస్కర్‌, నాయకులు ఆనందరెడ్డి, సురేష్‌, ఆనంద, మదనమోహన్‌రెడ్డి, డాక్టర్‌ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్‌ : విద్యతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని యంజెఆర్‌ ఇంజినీరింగ్‌ కళాశాల చైర్మన్‌ ఎంపీ అవినాష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌–డే సందర్భంగా నిర్వహించిన క్రీడలలో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి మఖ్యఅతిదిగా జబర్దస్త్‌ టీం (టెలివిజన్‌ టీం) రచ్చరవి విచ్చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని అలరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాలలో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. విద్య, క్రీడలలో ఆసక్తి చూపాలని, క్రీడలతో వ్యక్తిగత, మానసిక ఉల్లాసం సాధ్యమని గుర్తు చేశారు. విజేతలుగా నిలచి క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కెవిఎన్‌పిఎన్‌ రావు, కెఎస్‌విరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హజరత్‌ సయ్యద్‌వల్లి దర్గా ఉరుసు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎం రైల్వే గేట్‌ వద్దనున్న హజరత్‌ సయ్యద్‌ నాదర్‌షాహ్‌ వలీ దర్గా ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. రాత్రి అశ్వంపై పూల, తాజియాలో గంధం, మక్కా మదీన చాందినీ బండ్లతో, బార ఇమామ్‌ పీర్లు, మెరవణీ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఫకీర్లు వాయిద్యాలతో ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. దర్గా వద్దకు చేరుకుని గంధం చదివింపులు చేశారు. హిందూ, ముస్లిం సోదరులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నీళ్ల రసం.. చన్నీళ్ల స్నానం

ఆడిటింగ్‌ బృందంతో కేజీబీవీ బాలికలు

బి.కొత్తకోట : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం సోషల్‌ ఆడిటింగ్‌ బృందం తనిఖీలు, పరిశీలనలు నిర్వహించింది. ఈ సందర్భంగా బాలికలతో సిబ్బంది సమావేశం నిర్వహించి వివరాలు సేకరించారు. సాయంత్రం తల్లిదండ్రులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బాలికలు విద్యాలయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆడిటింగ్‌ సిబ్బంది ఎదుట ఏకరువు పెట్టారు. హాస్టల్‌లో అందిస్తున్న భోజనంలో రసం నీళ్ల మాదిరి ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. చలికాలం కావడంతో వేడి నీళ్లు లేవని, దీనితో చన్నీళ్లతో స్నానం చేయాల్సి వస్తోందని వివరించారు. వైద్యసేవలు అందుబాటులో ఉండటం లేదని ఆవేదన చెందారు. విద్యాలయానికి ఉండాల్సిన ఏఎన్‌ఎం లేకపోవడంతో వైద్య సేవలు అందుబాటులో ఉండటం లేదని, రాత్రివేళల్లో ఆరోగ్య సమస్య తలెత్తితే దూరంగా ఉన్న ఆస్పత్రికి వెళ్లాల్సిన వస్తుందని అన్నారు. విద్యాలయం భద్రత కోసం రాత్రిపూట వాచ్‌మెన్‌ పోస్టు ఖాళీగా ఉండటంతో భద్రత పరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై తగు చర్యలు తీసుకోని ఇబ్బందులు తొలగించాలని కోరారు. ఆ తర్వాత సాయంత్రం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో బాలికలు పేర్కొన్న ఇబ్బందులనే ఆడిటింగ్‌ సిబ్బంది ప్రస్తావించారు.

ఇక్కడా ఇంతే..

కేజీబీవీలో 225 మంది బాలికలు చదువుకొంటుండగా ఆడిటింగ్‌కు సంబంధించి నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి మొక్కుబడిగా 30 మందికిలోపే హాజరయ్యారు. సమావేశంలో ఎస్‌ఓ విశ్వలత, సిబ్బంది పాల్గొన్నారు.

నాటి సహకారం ఎప్పటికీ మరువలేం

గురువు దంపతులకు ఘన సత్కారం



టీచర్‌ రెడ్డప్పరెడ్డి దంపతులకు సన్మానం

తంబళ్లపల్లె : ఓ అంధ విద్యార్థికి నాడు సహకరించి భవిష్యత్తుకు బంగారు బాట చూపిన గురువు దంపతులు శనివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవనంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఘన సత్కారం అందుకున్నారు. వివరాలలోకి వెళితే.. మండంలోని మర్రిమాకులపల్లెకు చెందిన తంబళ్లపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రెడ్డప్పరెడ్డి మొదటగా పెద్దతిప్పసముద్రం మండలం పిడంవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా 2000 సంవత్సరంలో చేరారు. ఆ పాఠశాలకు అదే గ్రామానికి చెందిన ఆర్‌.వెంకటరమణ, నారాయణమ్మల దంపతుల కుమారుడు ఆర్‌.రామచంద్ర పుట్టకపోతే అంధ విద్యార్థి. చదువుపై ఆ విద్యార్థికి ఉన్న ఆసక్తిని గుర్తించిన టీచర్‌ రెడ్డప్పరెడ్డి అతన్ని తిరుపతి నవజీవన్‌ అంధ పాఠశాలలో చేర్పించారు. రామచంద్ర బీఏ, బీఈడీ పూర్తి చేశాడు. నగిరిలోని సోషియల్‌ వెల్ఫేర్‌ డిపార్టుమెంటులో చేరాడు. చిత్తూరు జిల్లా విజువల్లీ బ్లయిండ్‌ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నియ్యారు. విజయవాడలో జరిగిన విజవల్లీ చాలెంజిడ్‌ ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌ రాష్ట 5వ సర్వసభ్య సమావేశం జరిగింది. తన భవిష్యత్తుకు బంగారు బాట చూపిన టీచర్‌ రెడ్డప్పరెడ్డి దంపతులను కార్యక్రమానికి ఆహ్వానించారు. రాష్ట అధ్యక్షులు రవికుమార్‌, ఐజీ రవికృష్ణ, ఉద్యోగుల సంఘ నాయకులు సూర్యనారాయణ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఆయన సహకారం పలువురి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



ప్రసంగిస్తున్న ఎం.డి.షరీఫ్‌

పీలేరు రూరల్‌ : విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఏపీ రాష్ట్రమైనార్టీ సలహాదారు యండి షరీఫ్‌ అన్నారు. శనివారం పీలేరులో నిర్మాణంలో ఉన్న ఉర్దూ పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యవ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. పీలేరులో గత 10సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉర్దూ పాఠశాల భవన నిర్మాణాల నిర్మాణానికి, పాఠశాల ప్రహరీకి రూ.50లక్షలు నిధులు అవసరమన్నారు. ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి సహకారంతో నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఉర్దూ పాఠశాలలో 172 మంది విద్యార్థులు ఉండటం విశేష మన్నారు. పీలేరులో ఉర్దూ జూనియర్‌ కళాశాల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ యం.భీమేశ్వర్‌రావు, ఎంఈఓలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, పఠాన్‌ జాకీర్‌హుస్సేన్‌, హెచ్‌ఎం సత్యనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీ విజయంపై బీజేపీ నాయకుల సంబరాలు



పీలేరు క్రాస్‌ రోడ్డులో బీజేపీ నాయకుల సంబరాలు

పీలేరు : ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై పీలేరులో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు బి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధికే ప్రజలు పట్టంకట్టారని, బీజేపీ తిరుగులేని పార్టీగా ఢిల్లీ పీఠం దక్కించుకుందన్నారు. కార్యక్రమంలో వెంకట్రమణ, సుదర్శన్‌ రెడ్డి, సుధారాణి, పియంఖాన్‌, నారాయణస్వామి, నరసింహులు ,తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ : ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై గుర్రంకొండలో బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకొన్నారు. శనివారం స్థానిక బస్టాండులో పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చి సంబరాలు జరుపుకొని స్వీట్లు పెంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామాంజులు, నాయకులు బెజవాడ దినేష్‌, రామాంజులురెడ్డి పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘన విజయం సాధించడంపై శనివారం మండల కేంద్రంలో కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఓటర్లు ఆకర్షితులై బీజేపీకి పట్టం కట్టారని నాయకులు శ్రీకాంత్‌, శివయ్య, శంకర, భాస్కర్‌రెడ్డి, నందమూర్తి, రామచంద్ర,శ్రీరాములు రెడ్డి, రమణ, శివారెడ్డి, రెడ్డెప్ప పేర్కొన్నారు.

కురబలకోట : ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ప్రధాని మోదీ పాలనపై విశ్వాసాన్ని చాటిందని బీజేపీ నాయకులు మట్లివారిపల్లె గుణశేఖర్‌రెడ్డి, మారసాని రాజారెడ్డి, బావాజి, డెయిరీ కరుణాకర్‌ రెడ్డి, ముత్రవారిపల్లె మాధవరెడ్డి, కాకర్ల విశ్వనాథ, ప్రసన్న అన్నారు. శనివారం మండల కూడలి అంగళ్లులో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు.

మదనపల్లె : ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ స్థానాలు సాధించడంతో మదనపల్లె పట్టణంలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బెంగళూరు బస్టాండులో యల్లంపల్లె ప్రశాంత్‌, ఆకులకృష్ణమూర్తి , పట్టణ కార్యదర్శి భగవాన్‌ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు.

ఫ్రీహోల్డ్‌ భూముల రికార్డులు తనిఖీ



ఫ్రీహోల్డ్‌ భూముల రికార్డులు తనిఖీ చేస్తున్న జేసీ ఆదర్శరాజేంద్రన్‌

గుర్రంకొండ : మండలానికి చెందిన ఫ్రీహోల్డ్‌ భూములకు చెందిన రెవెన్యూ రికార్డులను జాయింట్‌ కలెక్టర్‌ ఆదర్శరాజేంద్రన్‌ తనిఖీ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయాన్ని జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా మండలంలో ఏఏ గ్రామాల్లో ఎంత మేరకు ఫ్రీహోల్డ్‌ భూములు ఉన్నాయో ఆరా తీశారు. సదరు భూముల పరిస్థితి, వాటి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే కార్యక్రమం పురోగతిపై సమీక్షించారు. ఇప్పటివరకు ఎంత శాతం మేరకు రీసర్వే పనులు పూర్తి చేశారో వివరాలు అడిగి తెలుసుకొన్నారు.

గత నెలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు, రైతుల నుంచి సమస్యలపై ఆరా తీశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యల్ని ఎంతమేరకు పరిష్కరించారు.. ఎన్ని అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ శ్రీనివాసులు, డీటీ బాబ్‌జాన్‌, ఆర్‌ఐ శశికళ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇంటర్‌ ప్రాక్టికల్‌ పరీక్షలకు ఆశాలకు డ్యూటీ దుర్మార్గం

– సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

మదనపల్లె : ఇంటర్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు జరుగుతున్న కేంద్రాల వద్ద ఆశా కార్యకర్తలకు డ్యూటీ వెయ్యడం దుర్మార్గం అని, వెంటనే రద్దు చెయ్యాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షల సందర్భంగా ఆ కేంద్రాల వద్ద వైద్య, ఆరోగ్య సిబ్బంది ని ఏర్పాటు చెయ్యడం ప్రభుత్వ భాద్యత అని అన్నారు. విద్యార్థులు ఏదైనా అసౌకర్యానికి గురైనా, అనారోగ్య సమస్యలు వచ్చినా పరీక్షించి, ప్రథమ చికిత్స అందించడానికి కృషి చెయ్యాల్సిన వైద్యాధికారులు వైద్యం పట్ల ఏ మాత్రం అవగాహన లేని ఆశాలకు విధుల్లో పెట్టడం అంటే విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడటమే అన్నారు. అధికారులు స్పందించి పరీక్ష కేంద్రాల వద్ద ఆశాలకు వేసిన డ్యూటీలను రద్దు చెయ్యాలని, ఎం.ఎల్‌.హెచ్‌.పి, ఏఎన్‌ఎం లకు భాద్యత అప్పగించాలని డిమాండ్‌ చేశారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం



శ్రీనివాసులురెడ్డిని సన్మానించిన నాయకులు, కార్యకర్తలు

నిమ్మనపల్లె : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, వైఎస్సార్‌ సీపీకి పూర్వవైభవం తీసుకోవద్దామని వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు కొమ్మెపల్లి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శనివారం నిమ్మనపల్లెలో పంచాయతీరాజ్‌ నియోజకవర్గ విభాగ అధ్యక్షులు రెడ్డి శేఖర్‌రెడ్డితో కలసి నాయకులు కార్యకర్తలు ఇటీవల వైఎస్‌ఆర్సీపీ మండల అధ్యక్షుడిగా నియామకం పొందిన కొమ్మెపల్లి శ్రీనివాసులు రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం నాయకులతో కలసి నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌ అహ్మద్‌ను మదనపల్లెలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అంసతరం అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షులు జగన్‌ మోహన్‌ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌ అహ్మద్‌కు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ జయప్రకాశ్‌ రెడ్డి, కోఆప్షన్‌ సభ్యులు మహమ్మద్‌ రఫీ, నాయకులు రామ్మోహన్‌ రెడ్డి,రామారావు, ఎర్రయ్య,దయాకర్‌ రెడ్డి, శశిధర్‌ రెడ్డి, రెడ్డి భాస్కర, నాగరాజా, కొండగాళ్ల రమణ, హోటల్‌ రఫీ, రాజగోపాల్‌, హేమంత్‌, యోగానంద రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై వేంకటరమణుడు



సూర్యప్రభ వాహనంపై స్వామివారు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఆరు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం టీటీడీ ఆగమ సలహాదారు శ్రీనివాసచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్‌, రమేష్‌బాబు, ధనుష్‌,క్రిష్ణమూర్తిలు స్వామి పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. ఉదయం సూర్యప్రభ,రాత్రి చంద్రప్రభ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. టీటీడీ ధర్మప్రచారపరిషత్‌ ఆధ్వర్యంలో హరికథ, కళాకారులుచే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈఓ గోపినాథ్‌, ఇన్స్‌పెక్టర్‌ ధుష్యంత్‌కుమార్‌, సిబ్బంది నగేష్‌, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

వెలుగు పాఠశాలకు సహకారం అందిస్తా

మదనపల్లె సిటీ : వెలుగు ప్రత్యేక పాఠశాలకు సహాయ,సహకారాలు అందిస్తానని హైదరాబాద్‌కు చెందిన సురేష్‌బాబు, వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలకు సందర్శించారు. విద్యార్థులు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పలకరించారు. కార్యక్రమంలో వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్‌ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్‌ లీనాకుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరిని మెమెంటో అందజేసిన అభినందించారు.